మధ్యలోనే నళిని అందుకున్నాడు 'ఆకుపచ్చ కోక" సంగతేకదూ? నీ బాధ? కాని మాలతిని ప్రేమించినంత ఒట్టు అన్నావే 'మృత్యువు' గాడితో... అదెలాగ? ముందు యీ కొండ ఎక్కేయ్! ఆనక పచ్చకోక మాలతీ..." అప్పుడు "కింగ్ ఆర్థర్ నైట్" లాగ విజయధ్వజంతో మాలతి దగ్గరికి వెళ్లు"

శాస్త్రి కూడా 'అంతే" నన్నాడు.

ప్రొద్దున్న పిక్‌నిక్‌కని కశింకోట తోటలో దిగుతూనే మృత్యుంజయం "కొండెక్కుతావురా?" అంటేసూర్యం - "ఓ! నీకంటే ముందే ఎక్కుతానని పందెం కట్టడం.. అది సాగి సాగి చివరకి మాలతి మీద "ప్రేమా" "ఒట్టూ..." "పదంటే పదా" లోకి దిగడం అన్నీ జ్ఞాపకం చేశాడు కూడా నళిని.

"ఓరేయ్! వాడే అక్కడికి టెన్సింగ్ నార్కే అయినట్టు గగ్గోలు పెడుతున్నాడు పైనుంచి. మీరు కూడా త్వరగా రండోయ్" బూటులేసులు విడిపోతే, వాటిని కట్టుకుంటూ కేకలేశాడు రామానుజం.

"ఓ.కే"

అందరూ చకచకా కొండమీదికి ఎక్కేస్తున్నారు. ముందు మృత్యుంజయం - వెనక వాళ్ళు తరుముకెడుతున్నారా? అన్నట్టు ఎక్కేస్తున్నాడు. అప్పుడప్పుడే తిన్న వేడి వేడి ఉప్మా, కాఫీ - అడ్డేవాడు, అడిగేవారు లేకపోవడం, చలి తగ్గుతున్న వాతావరణం.... యీ అయిదుగురికీ మాంఛి హుషారుగా వుంది.

"ఒరేయ్! ఆగుట్టమీదకు గిరీ వాళ్ళూ ఎక్కుతున్నార్రోయ్!" మధ్యలో 'ఒగర్పు' తీర్చుకుంది ఆగిపోయి రామానుజం అరిచాడు.

"అరే! శశిరేఖ కదూ?" -అవతల మరో కొండగుట్టను యింకో బృందం హుషారుగా పైకెక్కుతున్నారు, అందులో ఆడపిల్లలు కూడా వున్నారు. అది మెట్లున్న దేవుఁడి కొండ.

"ఔనురోయ్! బోటనీ శశిరేఖ... ఛా! మనం కూడా అదే ఎక్కవలసింది'. నాలిక్కర్చుకున్నాడు మృత్యుంజయం.

"ఓస్! అదేం కొండోయ్? కొండంటే యిదిగాని" అంటూనే అదను దొరికిందిగదాని ఒక్క దూకున మృత్యుంజయాన్ని దాటి మరి పది అంగలు ఎక్కిపోయాడు సూర్యం.

పట్టుదల మధ్య, పంతాల మధ్య వాళ్ళు మరి క్రింద సంగతి పట్టించుకోలేదు. సూర్యుడు కూడా మరీ మంచివాడుగాలేడు. తోటలో విడిసిన పిక్‌నిక్ బృందం సందడి దూరమై పోయింది. కళ్లు మూసుకొని ఎక్కినట్లే ఎక్కి పోయారు మిత్రబృందం.

మృత్యుంజయం షర్టు 'తుప్ప'లకు తగుల్కొని పావలా కాసంతమేర చిరిగిపోయింది. సూర్యం నల్లని వులెన్ ప్యాంటు మీద తెల్లని కొబ్బరి ముక్కలాంటి చొక్కా వేసుకున్నాడు. వులెన్ ప్యాంటు నిండా 'పూచికలు' గుచ్చుకుని నల్లులు పొడిచినట్లు పొడుస్తున్నాయి. పూచికలు తీసుకొనేందుకు విఫల ప్రయత్నం చేస్తూ-

"ఇలా కుడివైపు దిగుదాం... నా కెందుకనో యిటు గొర్రెలు, మేకలు మందలుగా "మే మే" మంటూ వుంటాయని తోస్తోంది" - సూర్యం మృత్యుంజయాన్ని భయంగా చూస్తూ అన్నాడు. మృత్యుంజయానికి ఒక ప్రక్కన ఆత్మాభిమానం అహంకారం,మరో ప్రక్కని భయం.

వాడు దగ్గాడు.

మరి పదిగజాలు కుడివేపుకే దిగేసరికి మృత్యుంజయం వాంతి చేసుకున్నాడు.

"నే ఛస్తానురా" అన్నాడు కూలబడి.

"ఛా! ఏం మాటలురా! దేవుడి దయవుంటే ఐదుగురం యింటికి వెళ్దాం.. లేదూ యిక్కడే చద్దాం..." రామానుజం మృత్యుంజయాన్ని తన భుజంమీద వాడి (మృత్యుంజయానిది) చెయ్యి వేసుకుని, ఎలాగో లేపి, నడిపించాలను కున్నాడు.

నళినికి వోసారి జర్రున జారి ప్రమాదంతప్పడంతో భయంపోయి ధైర్యం వచ్చింది. మృత్యుంజయం రెండో చెయ్యి తీసుకుని తన భుజంమీద వేసుకున్నాడు.

"మెల్లిగా దిగు-" అన్నాడు.

"ఒరే! శాస్త్రి! సూరీ! మీ యిద్దరూ దారి తియ్యండి మేం దొర్లిపోతే, మీరు అడ్డంగా కూలబడాలి తెలిసిందా?' అన్నాడు రామానుజం.

"జై! ఏడకొండలవాడికి జై" నీరసంగానే అన్నారు. ఎందుకన్నారో.. ఎవరనమన్నారో తెలీదు మనస్ఫూర్తిగా - మృత్యుంజయం తప్ప అందరూ అన్నారు.

మృత్యుంజయం మొహం తేలేశాడు. మరో అరగంటకు ఎలాగో కాస్త పచ్చిక చరియవున్న రెండో గుట్టమీదకు మృత్యుంజయాన్ని సాయం పడుతూ చేరుకున్నారు.

"మే మేఁ" మని మేకలు "హుర్రే... హుర్రే" మని గొడ్ల వాళ్ళ కేకలు. ఆదిలింపులు.

"హుర్రే! దేవుడున్నాడ్రోయ్!" అని కేక వేశాడు శాస్త్రి. కొండ నీటి పాయ ఒకటి పది అంగల ఎడంగా, నిర్మలంగా అమృత ఝరిలా పారుతున్నది.

నళిని పరుగెత్తుకెళ్లి, దోసిలితో నీళ్ళు తెచ్చి, మొదట మృత్యుంజయం మొహంమీద కొట్టాడు. రామానుజం మృత్యుంజయాన్ని వొళ్ళో పడుక్కో బెట్టుకొని

"ఒరే! కాస్త నీడ పీడిమీద పడేలా చూడండిరా.. కాసిన్ని నీళ్ళు నా మొహాన కూడా కొట్టండి!! అన్నాడు నిబ్బరంగా చేతులు వెనక్కి వేసుకొని. మృత్యుంజయానికి స్పృహ రావడం కోసం మిత్రులు నలుగురూ ఆశగా ఎదురు చూడసాగారు.

మృత్యుంజయం అనుమానమేగాని పసరులో విషమెక్కడ? కొంచెంసేపులోనే తెలివొచ్చింది.

"ఒరేయ్! ఎక్కడ్రావున్నాం?" అన్నాడు లేవడానికి ప్రయత్నిస్తూ-నీరసంగా.

